ఇవ్వాలి. వారిని సన్నద్ధం చేయాలి.

భారత్‌ను విదేశీ దాస్యం నుండి విముక్తి చేయాలని భగవానుడు కోరుతున్నాడు. త్రిగుణాలు కలిగిన మాయ నుండి తామస గుణం ఇక ప్రక్కకు తొలగవలసి ఉంది. భగవానుని ఇచ్ఛ ద్వారా భారత్ విశ్వంలో క్రొత్త భూమికను నిర్వహించవలసి ఉంది. రానున్న శతాబ్దాలు భారత గౌరవ గరిమను తిరిగి ప్రతిష్ఠిస్తాయి. ఇందుకోసమై భారత్ స్వతంత్రం కావాలి. ఆ భగవానుని ప్రేరణతోనే జనమానసంలో స్వాతంత్ర్య కాంక్ష పెల్లుబుకుతోంది. ఆ వెల్లువను సమర్థవంతం చేయడంలో నీకు కూడ భాగస్వామివి కావాలి.

అవసరమైన సందర్భాలలో క్రియాశీలంగా ప్రతిఘటించాలి. మామూలు పరిస్థితులలో ప్రజలను సన్నద్ధం చేయడానికై వాణినీ, లేఖినినీ ప్రయోగించాలి. భగవానుని సందేశాన్ని అందించడానికి ఇతర మార్గాలు కూడ ఉండవచ్చు. ఆ మార్గాలన్నింటినీ అనుసరించాలి.

ఈ ప్రేరణ ఉదయించే సమయంలో శ్రీరామ్ మనస్సులోనికి, ఇతర ఆలోచనలు తలెత్తసాగాయి. ఆలోచన ప్రవాహం ముందుకు సాగగానే, దివ్య ప్రేరణ దానిని అడ్డుకున్నది. ప్రతికూల ఆలోచనలు రాసాగాయి. శ్వాస తీసుకుని, వదలిన విధంగా -

భగవానుడు బంధన విముక్తికి ప్రేరణను కూడా తనకు తానుగా కలిగించవచ్చు. కానీ, ఆయన యోజన మనిషిని పురుషార్థిగా, కార్యశూరునిగా చేయడం. ఇకముందు జరపవలసిన ధర్మయుద్ధంలో అందరూ భాగస్వాములు కావాలి. అందరూ మహాయోధులు కావలసిన అవసరం లేదు. ఎలుగుబంట్లు, వానరులు, ఉడతల వంటి అల్పులని పిలువబడే ప్రాణులుకూడ దానిలో పాలు పంచుకోవాలి. చిన్న-పెద్ద, మంచి-చెడు, పక్షం-ప్రతిపక్షం - ఈ భూమికలన్నీ నిర్ణయించబడ్డాయి. గెలుపోటములు కూడ నిర్ణయించబడ్డాయి. నీవు చేయవలసిందల్లా సందేశాన్ని ప్రజలకు అందించడం. ఒంటరిగా ఏమి చేయగలుగుతానని ఆలోచించకు. మిత్రులు, సహచరులతో కూడిన ఒక విశాల సముదాయం నీకోసం ఎదురు చూస్తూ కనబడుతుంది. కాలంతో పాటు అది విస్తరిస్తూ పోతుంది. నీవు దానికి మార్గదర్శనం చేయాలి.

స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనడం, ప్రజాశిక్షణల యోజనకు తుదిరూపం ఇచ్చినట్లయింది. ఆలోచన, సంకల్ప-వికల్పాలతో పాటు ధ్యానం, సన్నిధుల ప్రవాహం ఈ వ్యవధి అంతటిలో సాగుతూ వచ్చింది. శ్రీరామ్ చిత్తం ఒకోసారి సవితా దేవత ధ్యానంలో మునిగిపోతుంది. ఒకోసారి ఆ దేవత తేజంలో తనను తాను కోల్పోయినట్లు అనిపిస్తోంది. అంతా కాలి బూడిద అయినట్లు అనిపిస్తోంది. కొద్ది క్షణాల తర్వాత శ్రీరామ్‌కు తన స్వతంత్ర చేతన మరింత పరిపక్వం, మరింత సమర్థం అయిన అనుభూతి, పూర్వం కన్న సుదృఢం అయిన అనుభూతి కలిగింది. చేతన యొక్క రసాయనం మారిపోతూన్నట్లు, చేతన ఏదో పరివర్తన చెందుతూన్నట్లు.

### తల్లి మందలింపు

ఈలోగా శ్రీరామ్ తల్లిగారు పూజ గదిలోకి తొంగి చూచారు. సూర్యుని అరుణ కిరణాలు గదిలో ప్రవేశిస్తున్నాయి. శ్రీరామ్ తన సంధ్యావందనం ముగించుకుని లేచి నిలబడ్డారు. ఇవాళ ఏం జరిగింది? ఇంతవరకు సంధ్యావందనం ఎందుకు పూర్తి కాలేదు? గతంలో జరిగినట్లు - సమాధి వంటి స్థితిలోకి వెళ్లిపోలేదు కదా? అపుడయితే శ్రీరామ్ తండ్రిగారు జీవించి ఉన్నారు. ఆయనకు ఆ విధి - విధానాలన్నీ తెలుసు. సమాధి స్థితి నుండి శ్రీరామ్‌ను ఆయన తిరిగి రప్పించారు. ఇప్పుడు శ్రీరామ్ అలాంటి సమాధి స్థితిలోకి వెళ్లిపోతే తిరిగి రప్పించేవారెవరు? తల్లిగారి మనస్సులో ఇలా రకరకాల చింతలు ముసురుకుంటున్నాయి. ఇక్కడ క్రొత్త సాధనాక్రమాన్ని ప్రారంభిస్తూ శ్రీరామ్ తన మార్గదర్శక సత్తా కట్టెదుట ఉన్నట్లు అనుభూతి పొందుతున్నారు. ఆ మార్గదర్శక సత్తా సాన్నిధ్యం ఆయన మన, ప్రాణ, చేతనలను ఆనందతరంగితం చేస్తోంది.

"ఇవాళ రోజంతా పూజ గదిలోనే కూర్చుండిపోతావా? జగన్మాతకు కాస్త విశ్రాంతి ఇవ్వు శ్రీరామ్".

**భగవంతుణ్ణి పొందడానికి సంయమనం కావాలి.**

తల్లి ఇచ్చిన ఈ పిలుపు - గురుసత్తా సన్నిధిలో కూర్చున్న అధ్యాయం పూర్తయిన తరువాత వాస్తవిక జగత్తులో శ్రీరామ్‌కు కలిగిన మొదటి అనుభవం. పూజగదిలోకి పలుమారులు తొంగిచూచిన తరువాత, ఆమె ఇక ఉండబట్టలేకపోయారు. తనకు తోచిన విధంగా తన ముద్దుల కుమారుణ్ణి మేలుకొలపడానికి ఆమె ప్రయత్నించారు. శ్రీరామ్ లేవడానికి ఉపక్రమించారు. అది చూచి ఆమె తిరిగి వెళ్లిపోయారు. వేదికపై ఉంచిన దీపపు సెమ్మెలో శ్రీరామ్ మరికొంచం నేయి పోశారు. పూజ పూర్తయిన తర్వాత దీపాన్ని వెలుగుతూ ఉండనివ్వడం ఇంతవరకు జరుగుతూ వచ్చిన పద్ధతి. నేయి పూర్తయిన తర్వాత వత్తి పూర్తిగా కాలిపోతుంది. దీపపు వెలుగు గాలిలో కలిసిపోతుంది. ఇప్పుడు మళ్లీ నేయి పోయడం వల్ల జ్యోతి వెలుగుతూ ఉంటుంది. గురుదేవులు నిర్దేశించిన విధానం ఆచరణలోనికి వచ్చింది. మహా పురశ్చరణ సాధనతో పాటు అఖండ జ్యోతి అవతరణ కూడ ఆ వసంత పంచమి రోజునే జరిగింది. వాటినుండి ఈ **అఖండ జ్యోతి** వెలుగుతూనే ఉంది. వరుసగా ఆగ్రా, మథురల మీదుగా ఈ అఖండ జ్యోతి 75 సంవత్సరాల యాత్ర చేసింది. క్రీ.శ.1971లో ఈ అఖండ జ్యోతి హరిద్వార్‌లోని శాంతికుంజ్‌లో స్థాపించబడింది.

శ్రీరామ్ ఎదురుగా ఉన్న జగన్మాతకు ప్రణామం చేశారు. ఆరోజున విసర్జ చేయలేదు. సంధ్యా గాయత్రి మామూలు జపంలో ఆవాహనతో పాటు విసర్జన ప్రక్రియ కూడ జరుగుతుంది. మహాపురశ్చరణలో విసర్జన జరగదు. ఎందుకంటే - అది నిరంతరం జరిగే అనుష్ఠానం. రోజువారీ ఉపాసన ఒక్క రోజులోనే పూర్తయే అధ్యాయం. మహాపురశ్చరణ ఒక విరాట్ గ్రంథ అఖండ పఠనం వంటిది. ఆ గ్రంథంలో పెక్కు అధ్యాయాలు ఉంటాయి. వాటన్నిటినీ పూర్తి చేయడానికి చాలా సమయం పడుతుంది. అది పూర్తయే వరకు దేవశక్తుల అర్చన-అభ్యర్థన సాగుతూనే ఉంటుంది. ఆ శక్తుల ఉపస్థితికి గౌరవం జరుగుతుంది. మన ఆచరణ, చింతన, స్థాయి ఆ దైవ శక్తుల గరిమకు అనుగుణంగా ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రాణాలు ఒడ్డి వాటిని అమలు జరుపుతారు. అఖండ జ్యోతి స్థాపన దాని నిరంతర దావీశక్తుల ఉపస్థితికి స్థూల ప్రమాణాలుగా నిలుస్తాయి.

శ్రీరామ్ పూజ గదినుండి బయటికి రాగానే తల్లిగారు తిరిగి హెచ్చరించారు.

"గాయత్రీ మాతతో ఇంతసేపు ఏమి చెపుతున్నావు? ఆమెకు విశ్రాంతి ఇస్తావా ఇయ్యవా?"

ఈ మాటలు చెపుతూన్న తాఈజీ ముఖంలో గారాబం తొణికిసలాడింది. తన కుమారుడు తన తండ్రితాతల మార్గంలో నడవడానికి సన్నద్ధుడు అవుతున్నాడనే గర్వరేఖ, సంతోషరేఖ ఆ ముఖంలో ప్రతిబింబించింది. పూజ, ఉపాసల తర్వాతి మెట్టు పౌరోహిత్యం, పురాణం చెప్పడమే కావాలన్నది ఆమె అంచనా, శ్రీరామ్ అందుకు జవాబు చెప్పలేదు. మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఉండిపోయారు.

తల్లిగారు మళ్లీ అడిగారు-

"ఏమన్నది గాయత్రీ మాత? ఇంత ఎక్కువ సేపు పూజ చేసి నీవు ఏమి అడిగావు?"

శ్రీరామ్ ఇలా జవాబిచ్చారు-

"ఏమీ అడగలేదు. సంధ్యావందనం చేస్తూన్న సమయంలో మా గురుదేవులు ప్రత్యక్షమయ్యారు. ఇక ముందు ఏమి చేయాలో ఆయన చెప్పారు. ఆయన చెప్పిన మార్గంలో నడవాలి".

"ఆయన చెప్పిన మార్గం ఏమిటి? నాకిచ్చిన మాట తప్పవు కదా నీవు. సన్యాసిగా మారాలని చెప్పారా నీ గురుదేవులు?"

తల్లిగారు అధైర్యపడ్డారు. శ్రీరామ్ ఆమెకు ఇలా ధైర్యం చెప్పారు-

"చెప్పలేదమ్మా, చెప్పలేదు. మీ దగ్గర ఉంటూనే సాధన

## బోధ కథ

# నిన్ను నీవు ఉద్ధరించుకో

నాగలిని నొక్కి పెట్టుతూ, ఎడ్లవెంట నడుస్తూ - అతడు అలసిపోయాడు. నుదుటి నుండి చెమట కారుతోంది. ఒక్కక్షణం అతడు కళ్లు పైకెత్తి ఆకాశం వైపు చూచాడు. సూర్యుడు ఆకాశం మధ్యకు వచ్చాడు. ఎండ మండిపోతోంది. ఈ వేడిమీ, ఈ అలసట అతడి శరీరాన్నీ, మనస్సునూ క్రుంగదీస్తున్నాయి. కనుక, అతడు ఆ ఎడ్లను నాగలితో పాటు ఆ పొలంలోనే వదిలివేశాడు. పొలం గట్టున ఉన్న ఉసిరి చెట్టు క్రింద కూర్చున్నాడు. ఆ చెట్టు చక్కని నీడ ఇచ్చింది. చల్లని పిల్లగాలికి అతడి చెమట ఆరిపోయింది. అతడిని వేధిస్తూన్న వేడిమీ, అలసటా తగ్గాయి.

అలా సేదదీరిన ఆ వ్యక్తి కాలిబాటలో బుద్ధభగవానుడు వెళుతూ ఉండడం చూచాడు. ఆయన వెంట కొందరు భిక్షువులు ఉన్నారు. బుద్ధ భగవానుని చూడగానే అతడి అంతఃకరణలో అద్భుతమైన శాంతి ఉదయించింది. ప్రశాంతమూ, ప్రసాదగుణ పూరితమూ అయిన ఆయన వ్యక్తిత్వం అతడి అస్తిత్వం అంతటిలో వ్యాపించింది. ఎందువల్లనో కాని - ఆయనను చూడగానే అతడికి ఒక అపురూపమైన తృప్తి కలుగుతోంది. పొలంలో దున్నుతూన్నపుడు పొలానికి నీరు పెడుతూన్నపుడు, నాట్లు వేస్తూన్నపుడు ఇంచుమించు ప్రతిరోజూ అతడికి ఆయన దర్శనం అవుతోంది. ఆయనను చూడగానేఅతడు తన పనిని నిలిపివేస్తాడు. రెండు క్షణాల పాటు ఆయనను రెప్ప వాల్చకుండా చూస్తాడు. ఆ తర్వాత తన పనిలోకి వెళ్లిపోతాడు. భగవానుని ముఖంలో కానవస్తూన్న శాంతి, ప్రసన్నత, భిక్షు సంఘ సభ్యులలో ఉప్పొంగుతున్న ఉల్లాసం అతడి అంతఃకరణను కదిపివేస్తాయి, కుదిపివేస్తాయి.

మొదట్లో అతడు భగవానుని గురించి వాకబు చేశాడు. ఎన్నో వివరాలు సేకరించాడు. ఎందుకంటే - ఆయనను చూస్తే అతడికి ఆశ్చర్యం కలుగుతోంది. అతడు ఇలా ఆలోచిస్తున్నాడు - ఈ వ్యక్తి ఇంత ప్రేమమూర్తిగా, ఇంత సుందర మూర్తిగా కనబడుతున్నాడు. అయినా ఈయన భిక్షువే. కానీ - సమ్రాట్టులకు సమ్రాట్టుగా కనబడుతున్నారు. ఆయన రాజమహలును వదలి భిక్షువుగా మారారని ఆ తర్వాత విచారించగా అతడికి తెలిసింది. భగవానుని జీవితగాథను తెలుసుకున్న మీదట, అతడి మనస్సులో భావ తరంగాలు ఉప్పొంగసాగాయి. అతడు ఇలా ఆలోచించాడు- నా దగ్గర ఏమీ లేదుకదా. ఈ నాగలి, ఈ చిన్న పొలం తప్ప. ఇవి మినహా - నా దగ్గర ఏముంది వదిలిపెట్టడానికి నేను కూడ ఈ మహావ్యక్తికి నీడగా ఎందుకు తయారు కాకూడదు. నేను కూడా ఈయన అనుచరుణ్ణి ఎందుకు కాకూడదు. ఈయన వ్యక్తిత్వంలో జాలువారుతూన్న అమృతంలోని ఒక బొట్టు నాకు అందవచ్చుకదా. నేను పేదవాణ్ణి. నిజమే, నేను నిర్భాగ్యుణ్ణి. నిజమే. అయినా - నామీద ఆయన కృప ప్రసరించవచ్చు కదా.

నేడు బుద్ధుని పరమ జ్యోతి అతడిపై ప్రసరించినపుడు ఈ భావాలు సముద్రపు కెరటాలవలె అతడి అంతఃకరణలో ఉప్పొంగాయి. అతడు ఇక ఉండబట్టలేకపోయాడు. బుద్ధభగవానుని శరణుజొచ్చి, సన్యాసం స్వీకరించాడు.

అయినా అతడి మనస్సులో ఏమూలనో ఒక అనుమానం మిగిలి ఉంది. అతడు ఇలా ఆలోచించాడు -

**పక్షి ఆకాశంలో జాడ విడువదు. ఆలోచన మనసులో ముద్ర విడువకూడదు.**